



మేడ్చల్ ఎమ్మెల్యేగా రెండోసారి గెలిచిన చామకూర మల్లారెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యేగా గెలుపొందిన మర్రి రాజశేఖర్ రెడ్డిలను మంగళవారం కీసరగుట్ట ఆలయానికి చెందిన వేద పండితులు కలిసి ఆశీర్వచనం అందజేశారు. ఎమ్మెల్యేలను కలిసిన వారిలో కీసరగుట్ట ఆలయ చైర్మన్ తటాకం రమేశ్‌శర్మ, ఆలయ ధర్మకర్తలు ఉన్నారు. *- కీసర, డిసెంబర్ 5*

## మజ్లిస్ పార్టీ కార్యాలయానికి నిప్పు

*పోలీసులకు ఫిర్యాదు..*

చాంద్రాయణగుట్ట, డిసెంబర్ 5 : చాంద్రాయణగుట్ట నియోజకవర్గం అషామాబాద్ బస్తీలో మజ్లిస్ పార్టీ కార్యాలయానికి మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని దుండగుడు పెట్రోల్ పోసి నిప్పంటించాడు. దీంతో స్థానికంగా కొంత అలజడి రేగింది. మజ్లిస్ పార్టీ నాయకుడు సయ్యద్ షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. అషామాబాద్ మజ్లిస్ పార్టీ కార్యాలయానికి గుర్తు తెలియని వ్యక్తి పెట్రోల్ పోసి నిప్పు పెట్టినట్లు తెలియడంతో.. వెంటనే కార్యాలయానికి వెళ్లామని తెలిపారు. వెంటనే ఘటనా స్థలానికి బండ్లగూడ పోలీసులు చేరుకొని సీసీ ఫుటేజీ దృశ్యాలను పరిశీలించారు. సీసీల ఆధారంగా స్థానికంగా నివసించే నలుగురు యువకులు రాత్రిపూట బస్తీలో తిరిగారని.. ఓ యువకుడు బస్తీ చౌరస్తా ప్రాంతంలో పార్క్ చేసిన ద్విచక్ర వాహనం నుంచి ప్లాస్టిక్ డబ్బాలో పెట్రోల్ తీసుకొచ్చి మజ్లిస్ పార్టీ కార్యాలయం తలుపులపై పోసి నిప్పంటించినట్లు సీసీ కెమెరాల ద్వారా పోలీసులు గుర్తించారు. నిప్పు పెట్టే సమయంలో మెడలో జాతీయ జెండా వేసుకున్నట్లు గుర్తించామని, త్వరలోనే దుండగుడిని అరెస్ట్ చేస్తామని పోలీసులు తెలిపినట్లు పేర్కొన్నారు. కాగా జరిగిన ఘటనపై స్థానిక ఎంఐఎం నాయకులు బండ్లగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# మాదిగలకు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలి



సమావేశంలో అభివాదం చేస్తున్న మాదిగ సంఘాల యునైటెడ్ ఫ్రంట్ నేతలు

- **తక్షణమే 6 గ్యారంటీలు అమలు చేయాలి**
- **ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి**

రవీంద్రభారతి,డిసెంబర్ 5 : రాష్ట్రంలో కొత్తగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోయే కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం మాదిగ కులానికి చెందిన నేతకే ఉపముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని మాదిగ సంఘాల యునైటెడ్ ఫ్రంట్ నేతలు డిమాండ్ చేశారు. ఇన్ని రోజులు దొరల తెలంగాణ అని నీతులు చెప్పిన కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రెడ్లను ముఖ్యమంత్రి చేయడం.. దయ్యాలు వేదాలు వల్లించినట్లే అవుతుందన్నారు. తక్షణమే ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే రాష్ట్రంలో మాదిగ కులానికి చెందిన ఎమ్మెల్యేకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలన్నారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాదిగ సంఘాల యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొక్కర భూమన్న మాట్లాడుతూ... కాంగ్రెస్ అధికారం కోసం.. బీఆర్ఎస్ ప్రభుత్వం దళితున్ని ముఖ్యమంత్రి చేయలేదని గగ్గోలు పెట్టి, తీరా అధికారం వచ్చాక సామాజిక న్యాయం పాటించకుండా రెడ్లను ముఖ్యమంత్రి చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయాన్ని తుంగలో తొక్కి రెడ్ల తెలంగాణగా మారుస్తుందని విమర్శించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కమ్మలు, రెడ్లు మాత్రమే ముఖ్యమంత్రులు అయ్యారని, తెలంగాణ రాష్ట్రంలో కూడా రెడ్లనే ముఖ్యమంత్రులను చేశారని... కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం ఎక్కడ పాటిస్తుందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడాన్ని స్వాగతిస్తున్నామని, ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలు తక్షణమే అమలు చేసి ప్రజలకు న్యాయం చేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. రైతులకు తక్షణమే రైతుబంధు అమలు చేయాలని, రేవంత్‌రెడ్డి చేవెళ్ల సభలో ఇచ్చిన చేవెళ్ల డిక్లరేషన్‌ను అమలు చేయాలని తెలిపారు. ఎన్నికల వాగ్దానంలో ఇచ్చిన 12 లక్షల దళిత బంధు పథకాన్ని అమలు చేయాలన్నారు. మాదిగ ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అధికార దాహంతో ప్రజలకు లేనిపోని వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. లేకుంటే ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. మీడియా సమావేశంలో తెలంగాణ ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఇటిక రాజు మాదిగ, తెలంగాణ మాదిగ హక్కుల దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు జున్ను రాజు మాదిగ, జాతీయ అధ్యక్షుడు వేముల బల్‌రామ్ మాదిగ, గోపి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్‌లో జిల్లా విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ రావు

రంగారెడ్డి, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ బేగంపేటలోని సెంటర్ ఫర్ ఎకనామిక్స్ అండ్ సోషల్ స్టడీస్‌లో మంగళవారం రాష్ట్రస్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్ ప్రదర్శన జరిగింది. ఇందులో రంగారెడ్డి జిల్లా విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చారు. బండ రావిర్యాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, లార్డ్స్ హైస్కూల్, మహా భాషం స్కూల్, శ్రీరామ్ యూనివర్సల్ హైస్కూల్ విద్యార్థులు పాల్గొని 'ఆరోగ్యం, సంక్షేమం కోసం పర్యావరణ వ్యవస్థను అర్థం చేసుకోవడం' అనే అంశంపై ప్రదర్శన ఇచ్చారు. పర్యావరణ హితం కోసం వ్యర్థ పదార్థాల వినియోగం, సామాజిక స్థితి గతుల మార్పు, మురుగు నీరు నిర్వహణ అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చిన విద్యార్థులను రంగారెడ్డి జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్‌రావు అభినందించారు.

# రేవంత్‌రెడ్డి ఇల్లు, కార్యాలయం వద్ద భారీ భద్రత

- **ఇంటి సమీపంలోని కార్యాలయంలో ప్రజా దర్బార్..!**
- **భద్రత, పార్కింగ్‌కు సంబంధించిన విషయాలపై అధికారుల ఆరా**

సిటీబ్యూరో, డిసెంబర్ 5(నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయబోతున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఇంటి వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జూబ్లీహిల్స్‌లోని ఆయన ఇంటి వద్ద ఆర్మూడ్ పోలీస్ సిబ్బందితో బందోబస్తు పటిష్టం చేశారు. మల్కాజిగిరి ఎంపీగా ఎన్నికైన తరువాత ఆయన ఇంటికి సమీపంలో జూబ్లీహిల్స్ రోడ్డు నం.41లో తన కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. తాత్కాలికంగా ఈ కార్యాలయాన్ని ప్రజాదర్బార్‌గా ఉపయోగించాలనే ఆలోచనలో ఉన్నారు. ఈ నేపథ్యంలోనే ఇంటలిజెన్స్ సెక్యూరిటీ విభాగం(ఐఎస్‌డబ్ల్యూ) అధికారులు ఆ కార్యాలయాన్ని మంగళవారం సాయంత్రం పరిశీలించారు. అక్కడకు వచ్చే వారికి పార్కింగ్, వసతులపై ఆరా తీశారు. రాష్ట్రం నలుమూలల నుంచి ఇక్కడకు ప్రతి నిత్యం భారీ సంఖ్యలో ప్రజలు వచ్చిపోయే అవకాశాలున్నాయి, అందుకు సరిపడా పార్కింగ్ సౌకర్యం, సాధారణ వాహనాలు ఎలా రావాలి, ఎలా బయటకు వెళ్లాలి, ముఖ్యమంత్రి, వీఐపీలకు సంబంధించిన వాహనాల రూట్ తదితర అంశాల గూర్చి ఆ ప్రాంతంలో అధికారులు పరిశీలించారు. ఈ పరిశీలనలోని అంశాలపై విశ్లేషణ చేసి ఐఎస్‌డబ్ల్యూ ఒక నివేదికను తయారు చేయనుంది. గురువారం రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆయన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టగానే ప్రజా దర్బార్‌ను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే అందుకు కావాల్సిన ఏర్పాట్లన్నింటిని అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. జూబ్లీహిల్స్‌లోని రేవంత్ రెడ్డి నివాసంతో పాటు కార్యాలయం వద్ద బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

## మహమూద్ అలీని కలిసిన బెంగాలీలు



మహమూద్ అలీని మర్యాద పూర్వకంగా కలిసిన తెలంగాణ బెంగాలీ సమితి అధ్యక్షుడు దిపాంకర్‌పాల్, నాయకులు

చార్మినార్, డిసెంబర్ 5 : బీఆర్ఎస్‌కు మద్దతుగా తెలంగాణ బెంగాలీ సమాజం నిలుస్తుందని బెంగాలీ సమితి అధ్యక్షుడు దిపాంకర్‌పాల్ స్పష్టం చేశారు. మాజీ హోంమంత్రి మహమూద్ అలీని మంగళవారం బెంగాలీలు, బీఆర్ఎస్ నాయకులు ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. తెలంగాణ వచ్చినప్పటి నుంచి బెంగాలీలు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తోనే ఉన్నారని, ఇక ముందు కూడా ఉంటామన్నారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ అధిష్ఠానం ఇచ్చే పిలుపు మేరకు పార్టీ కార్యక్రమాలను నిర్వహించి జయప్రదం చేస్తామని దిపాంకర్‌పాల్ తెలిపారు.

## స్వతంత్ర అభ్యర్థులు @15,845 ఓట్లు

**మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లాలో పోలైన మొత్తం ఓట్లు 15,83,675**

మేడ్చల్, డిసెంబర్ 5(నమస్తే తెలంగాణ): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నోటాకు 15,418 ఓట్లు పడగా... పోటీ చేసిన 56 మంది స్వతంత్ర అభ్యర్థులకు 15,845 ఓట్లు పోలయ్యాయి. నోటాకు పడిన ఓట్ల కంటే 427 ఓట్లు మాత్రమే స్వతంత్ర అభ్యర్థులకు వచ్చాయి. మేడ్చల్ నుంచి 10, మల్కాజిగిరి నుంచి 13, కుత్బుల్లాపూర్ నుంచి 5, కూకట్‌పల్లి నుంచి 12, ఉప్పల్ నియోజకవర్గం నుంచి 16 మంది స్వతంత్ర అభ్యర్థులు బరిలో నిలిచారు. 56 మంది స్వతంత్ర అభ్యర్థులందరికి కలిపి 15,845 ఓట్లు రాగా... నోటా ఓట్లతో వారు పోటీ పడినట్లయింది. జిల్లా వ్యాప్తంగా ఐదు నియోజకవర్గాల్లో 15,83,675 ఓట్లు పోలైన విషయం తెలిసిందే. పోటీ చేసిన 56 మంది స్వతంత్ర అభ్యర్థులలో 7 గురికి మాత్రమే 5 వందల పైచిలుకు ఓట్లు వచ్చాయి.

## ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకోవద్దు

**తెలంగాణ జనరల్ స్టూడెంట్ జేఏసీ**



సమావేశంలో మాట్లాడుతున్న గడ్డం శ్రీరామ్

ఖైరతాబాద్, డిసెంబర్ 5: రాష్ట్రంలో కొత్తగా ప్రభుత్వం ఏర్పాటు చేయబోయే కాంగ్రెస్ పెద్దలు ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకోవద్దని తెలంగాణ జనరల్ స్టూడెంట్ జేఏసీ (ఓయూ)రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం శ్రీరామ్ కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి కావాల్సినంత ఎమ్మెల్యేల సంఖ్యా బలం ఉందన్నారు. ప్రజాస్వామ్య యుతంగా రాష్ట్రాన్ని పరిపాలించాలని, ప్రభుత్వం ఏర్పాటైన తరువాత విద్యార్థులకు దీర్ఘకాలికంగా ఉన్న అనేక డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ప్రతి యూనివర్సిటీకి సంవత్సరానికి రూ.200 కోట్లు గ్రాంట్ కేటాయించాలని, విద్యార్థులు చదువుకునేందుకు విద్యాభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. టీఎస్‌పీఎస్సీని పునరుద్ధరించాలని, ఉద్యోగ నోటిఫికేషన్లు జారీ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జేఏసీ కార్యదర్శి సంతోష్, ప్రేమ్ నాయక్, ప్రసాద్, సంపత్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

కుత్బుల్లాపూర్, డిసెంబర్ 5 : ఆటోలో ప్రయాణిస్తున్న ఓ మహిళ కిందపడి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటు చేసుకున్నది. ఎస్ఐ రాంనారాయణ తెలిపిన వివరాల ప్రకారం... బహదూర్‌పల్లి ఇందిరమ్మ కాలనీకి చెందిన కె.విజయ(33) మేడ్చల్‌లోని చర్మాస్ కంపెనీలో పనిచేస్తుంది. మంగళవారం పనులు ముగించుకొని ఇంటికి వెళ్లేందుకు ఆటోలో ఎక్కి డ్రైవర్ సీటు పక్కన కూర్చుంది. మార్గమధ్యలో దూలపల్లి ఫారెస్ట్ అకాడమీ వద్ద మూలమలుపు వద్ద వెనకాల నుంచి అతివేగంగా దూసుకువచ్చిన ద్విచక్ర వాహనం ఆటోను ఢీ కొట్టింది. డ్రైవర్ పక్కన కూర్చున్న విజయ రోడ్డుపై పడిపోవడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ దవాఖానకు తరలించి, ద్విచక్రవాహన దారుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.